ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
గురువారం 14 ఆగస్టు 2025

భారీ వర్షాలకు అప్రమత్తం.. కంట్రోల్ రూం ఏర్పాటు

- 24 గంటలు అందుబాటులో వివిధ శాఖల అధికారులు
- కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 18002331495
- వాట్సాప్ నంబర్ 9398684240

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు సంబంధిత అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో లోలెవెల్ కాజ్‌వేల వద్ద పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వ్యవసాయ, హెల్త్, పీఆర్, మిషన్ భగీరథ ఇతర శాఖల అధికారులు కంట్రోల్ రూంలో సేవలందిస్తున్నారని తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీవరకు అధికారులు అందుబాటులో ఉండి, వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు తగిన సమాచారం అందిస్తారని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, వరద ప్రభావిత ప్రజలకు సహాయం చేసేలా సేవలందిస్తారని తెలిపారు. 24 గంటలు ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18002331495, వాట్సాప్ సెల్ నంబర్ 9398684240లను వర్షం, వరద ప్రభావిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ కార్యాలయాల్లో, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఉంటే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దన్నారు.

లంబో'ధరా'.. కొలిచేదెలా..

- ఉత్సవాలకు వినాయక విగ్రహాలు సిద్ధం
- అధిక ధరలతో భక్తుల బెంబేలు
- సిరిసిల్ల కేంద్రంగా విగ్రహాల తయారీ
- హైదరాబాద్, నాందేడ్ నుంచి భారీ విగ్రహాలు..
- జిల్లావ్యాప్తంగా ఉత్సవాల ఖర్చు రూ.15 కోట్ల పైనే..


సిరిసిల్లలో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న విగ్రహం


సిరిసిల్లలో విగ్రహాలను తయారుచేస్తున్న రాజస్థానీ కళాకారుడు

(ఆంధ్రజ్యోతి. సిరిసిల్ల)

గణనాథుల ఉత్సవాలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో భక్తులు సిద్ధమయ్యారు. ముడిసరుకులు, కూలీరేట్లు, రంగులధరల పెరుగుదలతో ఈసారి కూడా లంబోదరుడి ధరలు భారీగా పెరిగాయి. జిల్లా కేంద్రంగా తయారైన విగ్రహాలు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు తీసుకవెళ్తుండగా, భారీ విగ్రహాలను మహారాష్ట్రలో నాందేడ్, హైదరాబాద్, ప్రాంతాలనుంచి సిరిసిల్లకు తీసుకవస్తున్నారు. విగ్రహాలధరలతో పాటు రవాణాచార్జీలు కూడా నిర్వాహకులకు భారంగా మారాయి. ఈసారి 10ఫీట్ల విగ్రహమే రూ.18వేల నుంచి రూ.20వేల వరకు అమ్ముతున్నారు. 14నుంచి 15ఫీట్లవిగ్రహాలు రూ.40వేల నుంచి రూ.45 వేల వరకు ఉండగా, విభిన్నంగా ఇతరప్రాంతాల నుంచి వచ్చే భారీగా ఉన్న విగ్రహాలు రూ 2లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ధర పలుకుతున్నాయి. సిరిసిల్లలోని స్థానిక తయారైన విగ్రహాలతో పాటు వరంగల్, కోరుట్ల, జగిత్యాల, కామారెడ్డి ప్రాంతాలనుంచి సిరిసిల్లకు విగ్రహాలు తీసుకవచ్చి విక్రయాలు జరుపుతున్నారు. సిరిసిల్ల కేంద్రంగా విగ్రహాల కొనుగోళ్ల వేములవాడ, చందుర్తి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంబీరావుపేట, మండలాలల్లోని వివిధ గ్రామాల ఉత్సవ నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు.

● మట్టి వినాయకులపై ఆసక్తి...

బొజ్జ గణపయ్యకు ఎన్నెన్నో రూపాలు ఇచ్చి కోలుస్తుంటారు. ఏదేవునికి లేనన్ని ఆకృతులను ఏకదంతుడికి అందిస్తాం. ఎంతో సంతోషాన్ని కలిగించే పండుగల్లో 9 రోజుల పాటుజరుపుకునే వినాయక ఉత్సవాల్లో మట్టి విగ్రహాల వైపు కూడా ఆసక్తి చూపుతున్నారు. వినాయక చవితి పండుగ ఒక సంప్రాదాయమైతే.. నిమజ్జనం వయోభేదం లేకుండా ఒక సంబురంగా ఉంటుంది. నిమజ్జనం చేసే విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తోపాటు రసాయన రంగుల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా హాని కలిగిస్తాయని ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ పేరుతో చేస్తున్న ప్రచారానికి ప్రజల్లో కూడా మార్పు వచ్చింది. ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా మట్టి వినాయకులను ప్రజలకు అందిస్తుండడంతో, ఇళ్లలో ఏర్పాటు చేసుకునే విగ్రహాలను....

- మిగతా 8లో

● ఉత్సవాల ఖర్చు రూ.15 కోట్ల పైనే

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా లంబోదరుడికి స్వాగతం పలకడానికి, ఘనంగా ఉత్సవాలు నిర్వహించడానికి భారీగానే ఖర్చు చేయడానికి సిద్ధమయ్యారు. వినాయ చవితి ఈనెల 27న ఉండటంతో ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 5వేల వరకు భారీ విగ్రహాలను ప్రతిష్ఠించే అవకాశం ఉంది. ఇందుకోసం రూ.15కోట్లకు పైగానే నిర్వాహకులు ఖర్చు చేయనున్నారు. దీనికితోడు అన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించనున్నారు. వేములవాడ, సిరిసిల్ల, మున్సిపాలిటీల పరిధిలో ఎక్కువ సంఖ్యలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తే గ్రామాల్లో రూ.15వేల నుంచి రూ.60వేల వరకు విగ్రహాల ఏర్పాటుకు ఖర్చు చేయనున్నారు. గత సంవత్సరం కంటే ఈసారి 10శాతం వరకు ఖర్చు భారం పెరిగింది. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి ఇప్పటికే భారీ విగ్రహాలను తీసుకవచ్చి సిద్ధం చేశారు.

ఏటీసీలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - పోస్టర్ ఆవిష్కరణ


కలెక్టరేట్‌లో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యువత ఏటీసీ సెంటర్‌లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని ఏటీసీ సెంటర్‌లో అడ్మిషన్‌లకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26, 2026-27 విద్యాసంవత్సరానికి ఐటీఐలలో అడ్మిషన్‌ల కోసం గడువును ఈనెల 6వ తేదీనుంచి 28వ తేదీవరకు పొడిగించినట్లు తెలిపారు. ఐటీఐలో చేరాలనుకునే అభ్యర్థులు పదో తరగతి ఒరిజనల్ సర్టిఫికెట్‌లతోపాటు కుల ధ్రువీకరణ, స్థానిక, కనీసం 6వ తరగతి వరకు తెలంగాణలో చదువుకున్న స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఏడు మీ సేవా కేంద్రాలు..

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల సౌకర్యార్థం ఏడు మీసేవా కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా తెలిపారు. చందుర్తి మండలంలోని చందుర్తి, మూడపల్లి, గంభీరావుపేట మండలంలోని గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామం, వేములవాడ అర్బన్ మండలం తెట్టెకుంట(అగ్రహారం), ముస్తాబాద్ మండలం చీకోడ్, రుద్రంగి మండలం మానాల, సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లలో నూతన మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 19వ తేదీ వరకు కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

అనుబంధ ఆలయాలను సందర్శించిన ఈవో


బద్ది పోచమ్మ ఆలయంలో రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న ఈవో

వేములవాడ కల్చరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయాలను ఈవో రాధాబాయి బుధవారం సందర్శించారు. పట్టణంలోని బద్దిపోచమ్మ, భీమేశ్వర, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా ఆలయాల నిర్వహణపై సమీక్ష చేపట్టి, డీసీఆర్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రత, భక్తుల కోసం అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. వెంట అనుబంధ ఆలయాల పర్యవేక్షకులు వెంకటప్రసాద్, శ్యామ్ ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆసిఫాబాద్ కోర్టు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, న్యాయవాది పి. నరహరిపై కొంత మంది దాడి చేసి, గాయపరచడాన్ని ఖండిస్తూ సిరిసిల్ల కోర్టు విధులను బుధవారం న్యాయవాదులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


నూతన కడప ఏర్పాటు చేసి ఇంటిలోకి వెళుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 7

ఆర్థికాభివృద్ధిలో 'ఆదర్శ'ం..

- అవార్డు అందుకోనున్న ఆదర్శ మండల సమాఖ్య


మహిళా సమాఖ్య సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్(ఫైల్) 6

చిన్నబోనాల గురుకులంలో మెనూ ప్రకారం అందని భోజనం

- విద్యార్థులతో మాట్లాడేందుకు వెళితే పట్టించుకోని ప్రిన్సిపాల్ - బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ


సిరిసిల్ల చిన్నబోనాల గురుకుల పాఠశాల ఎదుట మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల చిన్నబోనాల సాంఘిక గురుకులంలో మెనూ ప్రకారం భోజనం ఇవ్వడం లేదని, దీనిపై విద్యార్థులతో మాట్లాడేందుకు వెళితే ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు గత నెల రోజులుగా సరైన భోజనం పెట్టకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, మెనూ పాటించడం లేదని బుధవారం గురుకులానికి వచ్చిన తల్లిదండ్రులకు విద్యార్థులు చెప్పారన్నారు. ఈవిషయం తెలుసుకున్న బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ బుధవారం గురుకులానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రిన్సిపాల్‌ను అడిగితే అనుమతులు ఇవ్వడం కుదరదని చెప్పడంతో అక్కడే బీజేపీ మహిళా నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులపై వివక్షతలతో ప్రిన్సిపాల్ వ్యవహరిస్తోందన్నారు. నెలరోజుల క్రితం వంటలు తయారు చేసే వారితో గొడవలు పెట్టుకోవడంతో వారు వంట చేయకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులే వంట చేసుకుని తినాల్సి వచ్చిందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి వెంటనే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని లేకుంటే బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు వేముల వైశాలి, నాయకురాళ్లు పూర్ణిమ, పద్మక్క తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, చైతన్యాన్ని పెంపొందించడానికే తిరంగా ర్యాలీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలల్లో దేశభక్తితో పాటు చైతన్యాన్ని పెంపొందించడం కోసమే హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ నేతన్న చౌరస్తా నుంచి ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తాల మీదుగా గాంధీ చౌక్ వరకు చేపట్టారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో గోపి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చి 78 సంవత్సరాలు పూర్తిచేసుకుని 79వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా దేశ ప్రజల్లో చైతన్యాన్ని, దేశభక్తిని నింపడంతోపాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయాలనే సంకల్పంతో ఈ ర్యాలీని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రపంచ దేశాలు నివ్వరపోయే విధంగా అపరేషన్ సింధూర్ చేపట్టామని, శత్రు దేశాల నుంచి భారతదేశాన్ని రక్షించడంలో ముందున్నామన్నారు. అదేవిధంగా ప్రపంచంలో ఆర్థికపరంగా నాలుగో స్థానం నుంచి మూడో స్థానంలోకి వస్తున్నట్లు దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, ఎర్రం మహేష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, పట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రత ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం హర్‌ఘర్ తీరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఇంటిపై జెండాను ఎగురవేయడం ద్వారా దేశభక్తిని చాటినవారం అవుతామన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం అనేక మంది మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పున్ని సంపత్, కోకన్వీనర్లు మామిడి హరీష్, పినకాసి అనీల్, లంకోజు చంద్రం, నాగసముద్రాల సంతోష్, సాయగౌడ్, మ్యాకల మల్లేశం, దేశెట్టి శ్రీనివాస్, ముత్తక్క, మధుసూదన్ రెడ్డి, స్వామి, చింతలపెల్లి తిరుపతిరెడ్డి, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందజేత

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వాసరవేణి పర్శరాములుకు సిలుముల రాజనర్సు స్మారక సాహితీ పురస్కారంతో సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ సన్మానించారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సిలుముల రాజనర్సు స్మారక సాహితీ పురస్కారం-2025ను రచయిత డాక్టర్ వాసరవేణి పర్శరాములు ఎంపికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రం బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్ చేతుల మీదుగా సిలుముల రాజనర్సు స్మారక సాహితీ పురస్కారాన్ని రచయిత డాక్టర్ వాసరవేణి పర్శరాములు అందించి సన్మానించారు. కార్యక్రమంలో నాఫ్సకాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఎలుముల రాజనర్సు స్మారక సాహితీ పురష్కారం కమిటి అధ్యక్షుడు సిలుముల జయవర్ధన్, కో కన్వీనర్ జనపాల శంకరయ్య, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు


జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలో పాల్గొన్న బాలికలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అండర్-15 బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలో ఎనిమిది మందితో బాలురు జట్టు, ఎనిమిది మందితో బాలికల జట్టును రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాకారుల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యవసర పునరావాస కేంద్రాల ఏర్పాటు..

ముస్తాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు పడున్నాయనే వాతవరణ సమాచారంతో ముందస్తుగా అత్యవసర కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పునరావాసం కోసం ఉత్తర్వులు వెలువరించారు. బుధవారం నుంచి ప్రతిరోజు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో వై స్వామి (ఫోన్‌నంబర్ 98491 83440), ఎ శ్రీనివాస్(9671013290) 24గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో విపత్కర పరిస్థితితులు ఎదురైతే ఆయా ఫోన్ నంబర్లను సంప్రదించాలని, పునరావాసం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పీఎం సూర్య ఘర్ పథకంపై కలెక్టర్ సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోలార్ విద్యుత్‌ను వినియోగించేందుకు గ్రామాలను త్వరలోనే ఎంపిక చేస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై రెడ్కో ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ పథకంపై ఫిబ్రవరిలో నిర్వహించిన సమావేశంలో సోలార్ విద్యుత్‌ను వినియోగించే గ్రామాల ఎంపిక, దీనిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించిన దానిపై అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో 5వేల కంటే ఎక్కువగా జనాభా ఉన్న గ్రామాల్లో ఈ పథకంపై వివిధ సదస్సులను నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో సౌరవిద్యుత్‌ను ప్రజలు విని యోగించుకునేలా డీఆర్‌డీవో, డీపీలతోపాటు ఇతర శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహించి పథకం సబ్సిడీలపై అవగాహన కల్పించామన్నారు. సోలార్ విద్యుత్‌ను వినియోగించుకునేందుకు ముందుకు వచ్చే గ్రామాలను త్వరలో ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫీద్దీన్, పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లిఖార్జున్‌రావు, రెడ్కో డిఎం మునీందర్‌రెడ్డి, పీడీవో లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదినంటూ..
మోసం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

సిరిసిల్లక్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదినంటూ పలువురిని మోసం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. సిరిసిల్ల పట్టణ సీఐ కె కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏనుగు ఫణీందర్ అనే వ్యక్తి న్యాయవాదిలా చలామణి అవుతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నాడు. మచ్చ నారాయణ అనే వ్యక్తి కొడుకుకు విడాకులు ఇప్పిస్తానని చెప్పిన ఏనుగు ఫణీందర్ ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు తీసుకున్నాడు. ఆ బాండ్ పేపర్లపై మచ్చ నారాయణకు చెందిన ఇంటిని బొల్లి మార్కండేయ, బాల కృష్ణలకు అమ్మినట్లు నకిలీ పత్రాలను సృష్టించాడు. ఇంటిని అమ్మినట్లు సృష్టించిన పత్రాలతో మచ్చ నారాయణను బెదిరించి వారి నుంచి 11లక్షల 60వేల రూపాయలు తీసుకున్నాడు. ఈ విషయమై మచ్చనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు ఏనుగు ఫణీందర్, బొల్లి మార్కండేయలను అరెస్టు చేసి జైలుకు తరలించారు. కాగా జైలు నుంచి వచ్చిన ఏనుగు ఫణీందర్ బొల్లి మార్కండేయ కొడుకు బాలకృష్ణను సైతం పోలీసులు అరెస్టుచేస్తారని తనకు హైకోర్టు న్యాయ వాదులు తెలుసునని బాలకృష్ణను అరెస్టు చేయకుండా బెయిలు తీసుకు వస్తానని చెప్పాడు. లక్షా11వేల రూపాయలు తీసుకుని బెయిల్ ఇప్పించ కుండా మోసం చేశాడు. దీంతో బొల్లి మార్కండేయ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

వెల్గటూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం పాషిగామా హరిత హోటల్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మేడి గణేష్ (24) అనే యువకుడు, ముచ్చకుర్తి అనిల్(25) అనే కానిస్టేబుల్ మృతి చెందారు. ఎస్‌ఐ ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం లక్షెట్టిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీబస్సు పాశిగామ సమీపంలోని హరిత హోటల్ వద్ద గేదెను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న లక్షెట్టిపేట మండలం ఇటిక్యాలకు చెందిన మేడి గణేష్, ముచ్చ కుర్తి అనిల్ తీవ్రంగా గాయపడగా అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన గణేష్‌ను ఆసుపత్రి తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యలో మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

గోడ కూలి ఒకరికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీవర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లో, పత్తిచేనుల్లో నీరు నిలవడంతో పాటు కొన్ని గ్రామాల్లో పురాతన ఇళ్లు నేలకులాయి. పెద్దబొంకూర్ గ్రామంలో కురిసిన వర్షానికి ఎలిగేటి రాయమల్లు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపడుతున్న తరుణంలో రాత్రి కురిసిన వర్షానికి గోడకూలింది. ఈ ప్రమాదంలో అతడి కుమారుడు శేఖర్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అలాగే బొంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వరదనీరు నిలిచిపోయింది.

రోడ్డుపై నిలిచిపోయిన భారీ వాహనం

● ట్రాఫిక్‌కు అంతరాయం



నిలిచిపోయిన భారీ వాహనం

శంకరపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాన్ని తీసుకెళ్తున్న లారీ రోడ్డుపై నిలిచి పోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శంకరపట్నం మండలం లోని కల్వల గ్రానైట్ క్వారీకి భారీ గ్రానైట్ రాళ్లను లారీల్లోకి ఎత్తే వీల్ లోడర్‌ను తరలిస్తున్నారు. ఈ క్రమంలో నేషనల్ హైవేనుంచి మొలంగూర్‌కు ఎక్స్‌రోడ్‌వైపు తిరగగానే ఆ వాహనం రాడ్ విరిగి లారీ అక్కడే నిలిచి పోయింది. ఈ వాహనం పూర్తిగా రోడ్డుకు అడ్డుగా ఉండడంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఎక్స్‌కవేటర్ తో లారీ వెనకాల మట్టి పోసి వీల్ లోడర్‌ను కిందకి దించారు. తర్వాత మరమ్మతు చేసి లారీని అక్కడి నుంచి తరలించారు.

ఆర్థికాభివృద్ధిలో ఆదర్శం

స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డు అందుకోనున్న ఆదర్శ మండల సమాఖ్య

ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన సభ్యులు

ఇల్లంతకుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : 'జీవితాన వెలుగుందనే నమ్మకాన్ని పెంచుదాం.. స్వర్గమనేదెక్కడున్నా నేలపైకి దించుదాం..' అనే ప్రార్థనా గీతంతో మహిళా సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయి. సమష్టి నిర్ణయాలతో ఆయా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధిలో ఆదర్శంగా నిలిచి జాతీయస్థాయిలో పురస్కారాన్ని అందుకోబోతున్నారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య 2004లో ఏర్పాటు కాగా, ప్రస్తుతం 46 గ్రామైక్య సంఘాలతో, 1103 స్వశక్తి సంఘాలలో 12420మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తూ వాటి ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందిన అనంతరం రికవరీ చేస్తున్నారు. సామాజిక రుగ్మతలపై మహిళలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నారు.

మహిళా సంఘ సభ్యుల పురోగతి..



కందికట్కూర్‌లో కుట్టుశిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న మహిళలు

మండలంలోని పలు గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు. మహిళలు సంఘాల ద్వారా రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్నారు. వ్యక్తిగత రుణాలు తీసుకొని పాడి ఆవులు, లేడీస్ ఎంపోరియంలు, బట్టల దుకాణాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద గ్రామైక్య సంఘాలకు వచ్చిన రూ.1.30కోట్లతో కోడిపిల్లల పెంపకం, క్యాంటీన్లు, కుట్టుమిషన్ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. కందికట్కూర్, గాలిపెల్లి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల యూనిఫామ్స్ కుడుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. సంఘంలోని ప్రతి మహిళ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తుండటం వల్ల సమాఖ్య రూ.59కోట్ల రుణాలు పంపిణీ చేసి 99శాతం రికవరీ చేసింది.

ధాన్యం కొనుగోళ్లలో ఆదర్శం

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణ మహిళా సంఘాలకు ఇవ్వాలని నిర్ణయించగా మండలంలోని మహిళా సంఘాలు ముందుకు వచ్చాయి. 28గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు, మండలకేంద్రంలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు నడిపించారు. 28లక్షల 80వేల క్వింటాళ్ల వరిధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.99లక్షల కమీషన్ పొందారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలు, గడ్డిచుట్టే యంత్రాలు కొనుగోలు చేసి రైతులకు అద్దెకు ఇస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. మండల కేంద్రంలో విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

దేశవ్యాప్తంగా ఉత్తమ మండల సమాఖ్యలకు అవార్డులు అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనితీరును పరిశీలించారు. ఉత్తమ సేవలు అందించే సమాఖ్యలకు 2024 ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డులకు ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 22మహిళా సంఘాలను ఎంపిక చేయగా సదరన్ రీజియన్ కింద రాష్ట్రంలోని ఇల్లంతకుంట ఆదర్శ మండల సమాఖ్య రెండో స్థానంలో ప్రతిభ కనబర్చింది. ఈనెల 15న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే ఉత్సవాల్లో అవార్డు అందుకోనున్నారు. సమాఖ్య అధ్యక్షురాలు వల్లంపట్ల గ్రామానికి చెందిన కట్ట సౌమ్య, మాజీ అధ్యక్షురాలు వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన బొడిగే వనజలు ఢిల్లీ వెళ్లారు. ఆదర్శ మండల సమాఖ్య సభ్యులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అభినందించడంతో పాటు నిరంతర ఆదాయం కోసం గ్యాస్ ఎజెన్సీ మంజూరు చేయాలని డీఆర్డీవోకు ఆదేశాలు ఇవ్వడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూనిఫామ్స్ కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా..



రంగు రేణుక, కందికట్కూర్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ కుడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. కందికట్కూర్‌లో 12మంది సభ్యులం కలిసి కేంద్రంలో రెండు నెలలపాటు యూనిఫామ్స్‌కుట్టడం ద్వారా రూ.4లక్షల వరకు ఆదాయాన్నిపొందాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రాణిస్తున్నాం.

క్యాంటీన్‌తో ఉపాధి పొందుతున్నా..



బండారి స్వాతి, ఇల్లంతకుంట

గీతకార్మికుడైన నా భర్త రమేష్ మృతి చెందాడు. కుటుంబ పరిస్థితుల వల్ల ఏదైన వ్యాపారం చేయాలనే ఆలోచనతో ఇందిరా మహిళాశక్తి కింద బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.3లక్షల రుణం తీసుకొని ఇల్లంతకుంటలో క్యాంటీన్ ఏర్పాటు చేశాను. మొదట్లో కొంత ఇబ్బంది అయినా ప్రస్తుతం బాగానే నడుస్తోంది. ఆర్డర్‌పై ఆహారాన్ని అందిస్తూ పిల్లలను పోషించుకుంటున్నాను. రుణాన్ని సకాలంలో చెల్లిస్తున్నాను. కుటుంబానికి తోడ్పాటు అందించిన ప్రభుత్వానికి, అధికారులకు రుణపడి ఉంటాను.

మహిళలు మరింత రాణించాలన్నదే లక్ష్యం



కట్ట సౌమ్య, ఆదర్శ మండల సమాఖ్య అధ్యక్షురాలు

మండల ఆదర్శ మహిళా సమాఖ్య జాతీయస్థాయి ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మండలంలోని సంఘాల్లో ఉన్న మహిళలు మరింత రాణించాలన్నదే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తా. ఇప్పటివరకు ఏ గ్రామంలోనైనామహిళలు సంఘంలో లేకపోతే కొత్త సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తా. సామాజిక రుగ్మతలపై మహిళల్లో చైతన్యం కల్పిస్తూ ముందుకు సాగుతున్నా. ఈనెల 15న ఢిల్లీలో అవార్డు తీసుకోవడానికి బయలుదేరాం.

బీఎడ్ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం బీఎడ్ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షల షెడ్యుల్‌ను యూనివర్సిటీ పరీక్షలు నియంత్రణ అధికారి డి సురేష్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. ఈ నెల 14వతేదీ నుంచి 29వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలు కూడా ఈనెల 14వ తేదీ నుంచి 25 వరకు జరగనున్నట్లు తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో గానీ, కళాశాలలోగానీ సంప్రదించాలని సూచించారు.

మేకలను ఎత్తుకెళ్లిన దొంగలు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సుంకరి ఓదెలుకు చెందిన నాలుగు మేకలను గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి ఎత్తికెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎత్తుకెళ్లిన మేకల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అంబర్ ప్యాకెట్ల పట్టివేత

హుజూరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న అంబర్ ప్యాకెట్లను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలో అక్రమంగా అంబర్ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. ఆటోలో ఒక లక్ష రూపాయల విలువ చేసే అంబర్ ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన అంబర్ ప్యాకెట్లు, ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నాలుగు రోజులైనా అదుపులోకి రాని మంటలు

● గోదాంలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న అధికారులు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరగ్గా మంటలు నాలుగురోజులైనా అదుపులోకి రాలేదు. రాత్రింబవళ్లు పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయినా గోదాం నుంచి దట్టమైన పొగతో మంటలు వ్యాపించడంతో ఎక్స్‌కవేటర్లతో కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేస్తున్నారు. తీసిన సంచుల నుంచి మళ్లీ మంటలు రాకుండా వాటిపై ఇసుక పోస్తున్నారు. గోదాంలోని గోనె సంచుల కింద వేసిన కట్టెలు ఉండడంతో మంటలు అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. గోనెసంచులు పూర్తిగా కాలిపోవడంతో రూ.97లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. గోదాం దెబ్బతినడంతో రూ.70లక్షల వరకు నష్టం వచ్చినట్లు అధికారులు తెలుపుతున్నారు. గోదాంను బుధవారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పరిశీలించి మంటలను అదుపు చేసేలా తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంటలను గురువారం పూర్తిస్థాయిలో అదుపులోకి తెస్తామని ఆయన తెలిపారు. ఆర్డీవో వెంట ఏఎంసీ ఛైర్మన్ కూన గోవర్ధన్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నీత, వరప్రసాద్, ఆర్‌ఐలు కాంతయ్య, ఉమేష్, గోదాం ఇన్‌చార్జి సురేష్, ఎస్సై-2 రాజునాయక్ ఉన్నారు.

150 గ్రాముల గంజాయి స్వాధీనం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తి వద్ద ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులవద్ద 150గ్రాముల నిషేధిత గంజాయి పట్టుకున్నారు. నిందితులు షేక్ గౌస్, మహ్మద్ షారు, మహ్మద్ సాహెబ్‌పై కేసు నమోదు చేశామని, 2బైక్‌లు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. నిందితులు నాగ్‌పూర్‌లో గంజాయిని కొనుగోలు చేసి చింతకుంటలో ఎక్కువధరకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు

వెల్గటూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి 10రోజుల జైలుశిక్ష విధిస్తూ ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏగి జానకి బుధవారం తీర్పునిచ్చారు. వెల్గటూర్ ఎస్‌ఐ ఉమసాగర్ తమసిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీలు నిర్వహిస్తుండగా ఆదిలాబాద్ జిల్లాకుచెందిన కండెల ప్రశాంత్(28) పట్టుబడ్డాడు. అతడిపై కేసునమోదు చేసి ధర్మపురికోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ జానకి విచారించి ప్రశాంత్‌కు పది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు అరుదైన గౌరవం

● ఇండియాస్ 100మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ జాబితాలో చోటు



మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్/మంథని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అనలిటిక్స్ ఇండియామ్యాగజైన్ తాజాగా ప్రకటించిన ఇండియాస్ 100మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ-2025 జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. భారత్‌ను ఏఐ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్న వ్యక్తులతోపాటు, సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న వారికి ఈ జాబితాలో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్‌ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతిఅయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షుడు దేబజాని ఘోష్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ఎంపికపై సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే తనకు ఈ గుర్తింపు వచ్చిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇది తెలంగాణ ప్రజలందరికీ దక్కిన గౌరవం అని స్పష్టం చేశారు.

నానో యూరియాపై
అవగాహన కల్పించాలి

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా (లిక్విడ్ యూరియా) వినియోగంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి మండలంలోని డీసీఎంఎస్ చింతకుంట ఫర్టిలైజర్ దుకాణాన్ని, గోదాంను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎరువుల వ్యాపారస్తులు విధిగా టార్పాలిన్ షీట్,దానిపై వరిఊక్కను వేసి ఎరువు లను నిల్వ చేయాలని సూచించారు. యూరియా బదులుగా అందుబాటులో ఉండే అమ్మోనియా సల్ఫేట్‌వంటి నత్రజని ఎరువులను వాడుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, సహాయవ్యవసాయ సంచాలకులు రణధీర్‌కుమార్, కొత్తపల్లి మండల వ్యవసాయాధికారి కృష్ణ ఉన్నారు.

చొప్పదండిలో చోరీ

చొప్పదండి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన తాళ్లపల్లి పోచమల్లు అనే రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఇంటిలో బుధవారం దొంగతనం జరిగింది. బుధవారం మధ్యాహ్నం ఫంక్షన్ కోసం సుల్తానాబాద్ వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికిరాగా ఇంటితాళం పగులగొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలోని నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు 50వేల రూపాయల నగదు, పది తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ నరేష్ రెడ్డి, క్లూస్‌టీం పరిశీలించారు. కాగా దొంగతనంపై ఇంకా ఫిర్యాదు రాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళను కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను కరీంనగర్ లేక్ అవుట్ పోస్ట్ పోలీసులు బుధవారం రక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్‌కుచెందిన మల్యాల రాజేశ్వరి (43) భూసమస్యల కారణంగా మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. లేక్ అవుట్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎంఏ హఫీజ్‌బేగ్ గమనించి ఆమెను కాపాడారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పటికే ఆమెపై చందుర్తి పోలీసు ఠాణాలో అదృశ్యం కింద కేసు నమోదైనట్లు గుర్తించి, అక్కడిపోలీసులకు అప్పగించారు.

వేర్వేరు కేసుల్లో నలుగురు అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

● బంగారం, వెండి, నగదు స్వాధీనం ● బంగారం కొనుగోలుదారుడి అరెస్టు



మానకొండూర్ పరిధిలో చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితుల అరెస్టును చూపుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు చోట్ల చోరీలకు పాల్పడిన నలుగురు అంతర్ జిల్లా దొంగలతోపాటు దొంగసొత్తు కొనుగోలుదారుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద బంగారం, వెండి, నగదుస్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీసు కమిషనరేట్‌కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం దీకంపల్లికి చెందిన టేకు గంగ సాయిలు(55), టేకు భూమయ్య(48) అన్నదమ్ములు. కూలి పనులు చేసుకునే వీరు జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసు కమిషనరేట్‌లోని మానకొండూర్, శంకరపట్నం, గంగాధర, రామడుగు మండలాల్లో దొంగిలించిన బంగారాన్ని నిర్మల్‌కు చెందిన ఉప్పుల వేణు సహాయంతో నిర్మల్‌లోని భార్త ఎక్నాత్‌శేల్కే అమ్ముతుండేవారు. ఇతను బంగారు షాపు నడుపుతూ దొంగిలించిన ఆభరణాలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో వేణు పరారీలో ఉండగా గంగసాయిలు, భూమయ్యతోపాటు మహారాష్ట్రలోని షోలాపూర్‌కు (ప్రస్తుతం నిర్మల్ జిల్లా మంజులాపూర్‌లో నివాసం) చెందిన భార్తఎక్నాత్ శేల్కే(34)ను అరెస్టుచేశారు. వీరివద్ద 45తులాల బంగారం, 170తులాల వెండి, లక్షా 40వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఏసీపీవెంకటస్వామి, ఏసీపీ సీసీఎస్ నరసింహులు, మానకొండూర్ సీఐ సంజీవ్, సీఐ ప్రకాష్, ఎస్సై స్వాతి, సిబ్బందినిసీపీ అభినందించారు.

● కరీంనగర్‌లోని వివేకానంద పురి భార్గవి ఎంక్లేవ్, వెంకటేశ్వర రెసిడెన్సీలలోని రెండు ప్లాట్‌లలో ఈనెల6న రాత్రి సుమారు 32తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈకేసులో రంగారెడ్డి జిల్లా గడ్డి అన్నారంలో నివాసం ఉంటున్న కరీంనగర్‌కు చెందిన దినేష్‌రాజ్ పురోహిత్ అలియాస్ ఠాకూర్ జగన్‌సింగ్ అలియాస్ డీజే(30), కరీంనగర్ జవహర్ నగర్‌లో నివసిస్తున్న కొత్తోజు సందీప్‌చారి అలియాస్ సందీప్(26)ను అరెస్టు చేశారు. 32తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. గతంలో నేరాలకుపాల్పడిన ఈఇద్దరికి చర్లపల్లి జైలులో ఉండగా పరిచయం ఏర్పడింది. జైలునుంచి విడుదలైన తరువాత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకొని అప్పులు చేశారు. అప్పులను తీర్చడానికి మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డారు. కరీంనగర్‌లో చోరీచేసిన బంగారాన్ని ఎల్లారెడ్డిగూడలోని ఒకఫైనాన్స్‌లో కుదువ బెట్టి డబ్బులు తీసుకున్నారు. కేసును ఛేదించిన ఏసీపీ ఎన్ వెంకటస్వామి, ఏసీపీ సీసీఎస్ నరసిం హులు, మూడోఠాణా సీఐ జాన్‌రెడ్డి, సీఐ ప్రకాష్, ఎస్సైలు చేరాలు, రమేష్‌తోపాటు సిబ్బందిని సీపీ అభినందించారు.

11కేవీ వైర్లు తగిలి ఒకరికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన బాసుమియా అనేవ్యక్తి 11కేవీ వైర్లు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. బాసుమియా బుధవారం వర్షం కురుస్తుండగా ఇంటిపైకిఎక్కి పరదాను సరిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆయన ఇంటి పైనుంచి వెళ్లతున్న 11కేవీ కరెంటు వైర్లు అతని చేతికి తగిలి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాసుమియాను జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం దొంతుల గంగయ్య అనేవృద్ధుడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొట్టింది. దీంతో గంగయ్య తీవ్రంగా గాయపడటంతో అతన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. రామగుండం మండలం గోలివాడకు చెందిన ఆయన మండల కేంద్రంలోని ఓ వివాహ వేడుకలో పాల్గొని రోడ్డు దాటే క్రమంలో కారు ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు సంఘ టన స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పాలకుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాల తక్కళ్లపల్లిలో ఇటీవల చోరీకి పాల్పడ్డ నిందితుడిని బసంత్ నగర్ పోలీసులు అరెస్టుచేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ పుల్ల కరుణాకర్ వివరాలు వెల్లడించారు. అంతర్గాం మండలం పెద్దంపేటకు చెందిన పరకాల అశోక్ కొన్నిరోజులుగా మద్యానికి అలవాటు పడి డబ్బు కోసం చోరీలు చేస్తున్నాడు. ఈసాలతక్కళ్లపల్లిలో దాడి నాగరాజు ఇంటికి తాళంవేసి ఉండగా తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 2తులాల బంగారు గొలుసు,పుస్తెలతాడు చోరీ చేశాడు. అదే గ్రామానికి చెందిన పెసరి మల్లేష్ ఇంటికి వేసిన తాళం పగలకొట్టి బీరువాలో ఉన్న 3తులాల బంగారు హారం చోరీ చేశాడు. సుల్తానాబాద్‌లోని శాస్త్రినగర్‌లో రాత్రివేళ ఓ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోఉన్న వెండి, బంగారు అభరణాలను దొంగిలించాడు. తాగినమైకంలో బంగారు అభరణాలను ఎక్కడో పడవేయగా మిగతా వెండి వస్తువులను, ఈసాలతక్కళ్లపల్లిలో దొంగలించిన 3తులాల బంగారు ఆభరణాలతో బుధవారం పెద్దపల్లికి వెళ్తుండగా బసంత్‌నగర్ బస్టాప్‌వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతనివద్దనుంచి 3తులాల బంగారు హారం, వెండివస్తువులు సీజ్‌చేసి నిందితుడిని అరెస్టుచేసినట్లు వెల్లడించారు. నేరస్తుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ ఆర్‌స్వామి, సిబ్బందిని ఏసీపీ గజ్జికృష్ణ అభినందించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లికి చెందిన లెక్కల ప్రశాంత్ ఈ నెల 9న తన మొబైల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల బ్రిడ్జి వద్ద పోగొట్టుకున్నాడు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. యజమానికి బుధవారం కరీంనగర్ రూరల్ ఠాణాలో సీఐ నిరంజన్‌రెడ్డి అప్పగించారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. వారివద్ద రూ.15,700నగదు, 7 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.





"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి.
'స్వరాజ్యం మా జన్మహక్కు.'
అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.

ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్ల

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి.



మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.

ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్‌లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్ల

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేత ులమీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్లారు.

ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఒపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి నూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్నిసామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహారి బాయి, 102 ఏళ్ల

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

● సాంత్వన్, ఫొటోలు: హరిప్రేమ్

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

చొప్పదండి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు తేదీని ఈనెల 27వరకు పొడిగించినట్లు తెలిపారు. బాలికలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారని, బాలికలు అధిక సంఖ్యలో దరఖాస్తులను చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- లబ్ధిదారులకు చీర, సారెతో హాజరు



లబ్ధిదారులకు చీర, సారెను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు నూతన కడప ఏర్పాటుకు చీర, సారెతో ఆది శ్రీనివాస్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో చాలా ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, ఇప్పటికే బేస్మెంట్ పూర్తి చేసుకుని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మ గౌరవంతో బతకాలనే ఆలోచనతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందని తెలిపా రు. గత ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మాణం చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి చీర, సారెతో వస్తానని చెప్పిన మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకా రం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి చీర, సారెతో వచ్చానని గుర్తుచేశారు.

ఆర్టీసీకి రాఖీ బొనాంజా

రీజియన్ వ్యాప్తంగా రూ. 15 కోట్లకు పైగా ఆదాయం

భగత్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాఖీ పండుగను పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు ఐదు రోజుల్లో 15 కోట్లకు పైగా ఆదా యాన్ని సమకూర్చుకున్నది. కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉన్నాయి. రీజియన్ వ్యాప్తంగా 15.48 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. రీజియన్ వ్యాప్తంగా రాఖీ పండుగను పురస్కరించుకుని వివిధ డిపోల నుంచి అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపించి ఆదాయం సమకూరే విధంగా ప్రణాళికలు రూపొందించారు.

మహిళలే అధికం

రీజియన్ వ్యాప్తంగా పురుషులకన్నా మహిళలే అధికంగా ప్రయాణించారు. రీజియన్ వ్యాప్తంగా 29,10,435 మంది ప్రయాణించగా అందులో మహాలక్ష్మి పథకం కింద మహిళలు 21,21,668, పురుషులు 7,88,767మంది ప్రయాణించారు. గోదావరిఖని డిపోకు రూ. 2.23 కోట్లు, హుస్నాబాద్‌కు 87.34 లక్షలు, హుజూరాబాద్‌కు 1.17 కోట్లు, జగిత్యాలకు 1.78 కోట్లు, కరీంనగర్-1కు 1.59 కోట్లు, కరీంనగర్-2కు 2.41 కోట్లు, కోరుట్లకు 1.14 కోట్లు, మంథనికి 85.4 లక్షలు, మెట్‌పల్లికి 1.07 కోట్లు, సిరిసిల్లకు 1.17 కోట్లు, వేములవాడకు 1.14 కోట్ల ఆదాయం వచ్చింది.



ఆర్టీసీని ఇలాగే ఆదరించాలి



బి రాజు, రీజినల్ మేనేజర్

రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించడంతో అధిక ఆదాయం సమకూరింది. ప్రణాళికా బద్ధంగా అన్ని డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులను నడిపించాం. ఆర్టీసీ ఆదరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు. అంకిత భావంతో పనిచేసిన ఆర్టీసి సిబ్బందికి అభినందనలు.

కొండగట్టులో పోలీసుల తనిఖీలు

- డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాల స్పెషల్ డ్రైవ్
- ఆలయాల వద్ద భద్రత కట్టుదిట్టంలో భాగంగా చర్యలు



ఆలయం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

మల్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో భద్రతపై బుధవారం పోలీసులు తనిఖీలు చేశారు. ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో భద్రత చర్యలను బలోపేతం చేయడం కోసం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ఆలయ ప్రధాన ద్వారం, మండపం, భక్తుల ఆలయ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్, వసతిగృహాలు తదితర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ పుణ్యక్షేత్రాల వద్ద భద్రత చర్యలు మరింత కట్టుదిట్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలు కనిపిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌కుగాని డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సై నరేశ్ కుమార్, డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాలు పాల్గొన్నాయి.


శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 12,769 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 12,769 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 45.161 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 4,163 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందు లో కాకతీయ కాలువకు 2,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూ సెక్కులు విడుదల అవుతుండగా 482 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 39.713 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 7.563 టీఎంసీల నీటిని అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ఉప్పొంగంగా..

పంప్‌హౌస్‌ల నుంచి ఎత్తిపోతలు ప్రారంభం



రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్ నుంచి ప్రవహిస్తున్న నీరు

ధర్మారం/రామడుగు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి లింక్ -2 నంది పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. నంది మేడారం సమీపంలోని నంది పంప్‌హౌస్‌కు గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లి నుంచి నీటిని వదిలి పెట్టగా, అక్కడి నుంచి మూడు మోటార్లను ప్రారంభించి 9,450 క్యూసెక్కుల నీటిని గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోస్తున్నారు. నిర్మల్ జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షాలతో కడెం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది. అక్కడి నుంచి 11,478 క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా వదిలి పెట్టడంతో ఆ నీటితోపాటు, పరివాహక ప్రాంతం నుంచి 7,584, మొత్తం 19,062 క్యూసెక్కుల వరద నీరు ఎల్లంపల్లికి వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలకు 14.069 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఈ క్రమంలో ముందస్తు చర్యగా మండలంలోని నంది మేడారంలోని నంది పంపు హౌస్ నుంచి మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్‌లో మూడు మోటార్లను ఆన్ చేసి అంతే నీటిని గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అక్కడి నుంచి నేరుగా వరద కాలువ ద్వారా శ్రీ రాజ రాజేశ్వర డ్యాంకు నీరు ప్రవహిస్తుంది. ఈ ప్రక్రియ వారంపాటు కొనసాగుతుందని అధికారులు తెలి పారు.




ధర్మారం మండలం నంది పంప్ హౌస్ వద్ద ప్రవహిస్తున్న నీరు

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి



గోదావరి నుంచి భక్తులను బయటకు తీసుకు వస్తున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద బుధవారం గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి నీరు నదిలో చేరింది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. దీంతో గోదావరి నీటి మట్టం పెరిగింది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల చిన్నగద్దె నీటిలో మునిగి గోదావరి నదీ స్నానఘట్టాలు ఆనుకొని గోదావరి వరద కొనసాగుతోంది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది మైకుల ద్వారా అప్రమత్తం చేశారు. కొందరు భక్తులు లోతు ప్రదేశాల్లో స్నానాలు చేసేందుకు వెళ్లగా ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బలవంతంగా బయటకు తీసుకువచ్చారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్ రావు ప్రజలను అప్రమత్తం చేశారు.



గోదావరి ఉధృతి

లంబో'ధరా'.. కొలిచేదెలా..

(5వ పేజీ తరువాయి)

మట్టితో చేసినవి వాడుతున్నారు. వీటితోపాటు కొందరు మండపాల నిర్వాహకులు భారీ మట్టి వినాయకులను ఏర్పాటు చేస్తున్నారు.

శ్రమైక జీవనం..

శ్రమైక జీవనానికి మించింది లేదంటారు. పేదవాళ్ల చమట చుక్క ల్లోనే ధనం దాగి ఉంటుంది. సిరిసిల్లలో రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కళాకారులను తెప్పించి విగ్రహాలను తయారు చేయిం చారు. వినాయక ఉత్సవాల కోసం విగ్రహాలను అందించడానికి ఎక్కు వగా రాజస్థాన్ నుంచి కళాకారులు ప్రతి ఏటా సిరిసిల్లకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు తమహస్త నైపుణ్యంతో రకరకాల రూపాల్లో సుంద రాకృతులను ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. పల్లెల్లో, పట్టణాల్లో పందిళ్లు వేసి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని సామూహికంగా భక్తి భావంతో పూజలు జరుపుతారు. వినాయక చవితికి మూడు నెలల ముందే రాజస్థాన్ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కళాకారులు సిరిసిల్ల ప్రాంతానికి వచ్చి ప్రతిఏటా వినాయక విగ్రహాలను పెద్ద సంఖ్యలో తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారుచేసిన విగ్రహాలు సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు కూడా సరఫరా అవుతాయి. రాజస్థాన్ నుంచి వచ్చిన ఈ కళాకారులు ప్రతిమలను తయారు చేయడమే తమ జీవనాధారమని పేర్కొంటున్నారు. దుంప పిండి, పేపర్ పౌడర్, వైట్ ప్లాస్టర్‌తో వినాయక విగ్రహాల తయారీని చేస్తామ న్నారు. మూడు మిశ్రమాలను కలుపుకొని ఆ పిండిని రబ్బరులాగా తయారుచేసుకొని వాటితోనే వినాయక ప్రతిమల విడి భాగాలు తయారవుతాయన్నారు. వాటితో వినాయక విగ్రహాలను తయారుచేస్తామని, తాము తయారుచేసే విగ్రహాలకు మంచి ధర పలుకుతాయన్నారు. ప్రస్తుతం విగ్రహాయల తయారీకి ఉపయోగించే ప్లాస్టర్‌ఆఫ్ ప్యారీస్, గమ్, కొబ్బరి పీచ్చు ధరలు బాగా పెరిగిపోయాయని పేర్కొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు



ఎల్లారెడ్డిపేటలో బారులు తీరిన రైతులు



కందికట్కూర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సింగి ల్‌విండో గోదాం, గ్రోమోర్ ఎరువుల దుకాణం ఎదుట బుధవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. అధిక సంఖ్యలో తరలి వచ్చి ఎరువుకు ఏగబడ్డారు. తమ వరకు అందని భావించిన అన్నదాతలు ఆందోళనకు దిగారు. రైతులు మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోలీసుల పహారాలో యూరియాను పంపిణీ చేశారు.

● కోనరావుపేట: యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని మనగ్రోమోర్ వద్దకు సుమారు 300 బస్తాలు యూరియా వచ్చిందని తెలుసుకొని సుమారు 500 మంది రైతులు యూరియా కోసం బారులుతీరారు. యూరియా ఎవరికి పూర్తిగా సరిపడకపోవడంతో ఇబ్బందిపడ్డారు. కొంతమందికి యూరియా దొరకకపోవడంతో వెనుదిరిగారు. అంతేకాకుండా అధికారులు యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

● ఇల్లంతకుంట : యూరియా కోసం రైతులు విక్రయకేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని సహకార సంఘ గోదాంలోకి యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు బధవారం ఉదయమే క్యూకట్టారు. గోదాంకు వచ్చిన యూరియా బస్తాలకంటే రైతులు ఎక్కువ మంది రావడంతో రద్దీ నెలకొంది. పోలీసులు కేంద్రం వద్దకు చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు వచ్చి రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అధికారులు రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని పేర్కొంటున్నారు కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు.

దసరా పండుగకు గృహప్రవేశం చేయాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని దసరా పండుగకు అందరూ గృహప్రవేశం చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం కొలనూరు పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో కలకుంట్ల లక్ష్మణ్ రావు, రమణ దంపతులు పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారు అయిన ఆడబిడ్డ రమణకు చీర, సారే పెట్టి ఇంటిని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల స్వంత ఇంటి కల నెరవేరుతున్నదని తెలిపారు. కోనరావుపేట మండలం కొలనూరు పరిధిలోని గొల్లపల్లిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని గుర్తు చేశారు. ఆనాడు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేరుస్తూ ముందుకు పోతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బుధవారం సంబరాలు నిర్వహించారు. గ్రామంలో 38మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య పేర్కొన్నారు. 32 మంది లబ్ధిదారులు రెంటల్, స్లాబ్ స్థాయికి పనులు చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మహేందర్, గౌస్, పర్శరాములు, రాజు, శ్రీధర్, మహేశ్, దామోదర్, కిషన్, ఎల్లారెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారంలో రాణించాలి : కలెక్టర్

గంభీరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు వ్యాపారంలోను రాణించి, స్వయం సమృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం లింగన్నపేట శ్రీమణికంఠ గ్రామ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఇందిరా మహిళా సంఘం ద్వార ఏర్పాటైన ఎరువులు, విత్తనాల దుకాణాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం మేరకు ఇందిరా మహిళా శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డెయిరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాది యూనిట్లను అందజేస్తున్నామన్నారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, అనవసర ప్రచారాన్ని నమ్మవద్దని, జిల్లాకు సరిపడా యరియా నిలువలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ, తహసీల్దార్ మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల రవాణా కష్టాలను తీర్చేందుకే సైకిళ్ల పంపిణీ



సైకిళ్ల పంపిణీలో పాల్గొన్న గోపి, ఎంఈవో కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పదో విద్యార్థుల రవాణా కష్టాలు తీర్చేందుకే మోదీ కానుకగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ సైకిళ్లను అందజేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 34 మంది పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణహరి, హెచ్‌ఎం మురళీధర్, రామచంద్రారెడ్డి, తిరుపతి రెడ్డి, గణేశ్, నరేశ్, సుధాకర్, శ్రీశైలం, బుగ్గారెడ్డి, గాల్‌రెడ్డి, యాదగిరి, రంజిత్‌కుమార్, పూర్ణిమ, తేజశ్రీ, మంజుల, బాలకృష్ణ, కుమార్, చరణ్, నవీన్, కిరణ్‌నాయక్, లక్ష్మణ్, బాలగౌడ్, అరవింద్, రమేశ్‌నాయక్, గణేశ్‌నాయక్, సాజిద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలపై తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా ఏబీవీపీ నాయకులు కృషి చేయాలని విభాగ్ కన్వీనర్ అజయ్ కోరారు. సిరిసిల్ల పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిరిసిల్ల నగర ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విభాగ్ కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ జాతీయ పునర్నిర్మాణమే లక్ష్యంగా, జ్ఞానం, శీలం, ఏకత, సిద్ధాంతాలతో జాతీయ భావాలు నింపడానికి అఖిల భారతీయ విద్యార్థిపరిషత్ పని చేస్తుందన్నారు. దేశంలో విద్యార్థుల సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలను పరిష్కారించే దిశగా ఏబీవీపీ పనిచేస్తుందన్నారు. దేశభక్తిని పెంచే మరెన్నో ఉద్యమాలు చేస్తూ ప్రపంచంలో అతిపెద్ద విద్యార్థుల సంస్థగా నిలిచిందన్నారు. విద్యారంగ సంస్థలలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారించే దిశగా ప్రతి కార్యకర్తలు పనిచేయాలన్నారు.

సిరిసిల్ల పట్టణ ఏబీవీపీ కమిటీ

సిరిసిల్ల నగర ఏబీవీపీ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు విభాగ్ కన్వీనర్ అజయ్ ప్రకటించారు. నగర్ కార్యదర్శిగా రుద్రవేణి ధనుష్, ఇన్‌చార్జ్‌లుగా పసునూరి సాయితేజ, చిన్న మహేష్, నగర ఉపాధ్యక్షులుగా కారుణాల శివ, సిద్ధార్థ, మహ్మద్ సమీర్, నీరటి శ్రీశ్రోతన్, రిషి కుమార్, నగర సంయుక్త కార్యదర్శిగా మేర్గు సాయితేజ, సయ్యద్ అసిమ్, గణేష్, సోషల్ మీడియా ఇంచార్జ్‌గా విశ్వ, నగర కార్యవర్గ సభ్యులుగా మణితేజా, సిద్దు, పవన్, రోహిత్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల వార్డు బాట

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు బుధవారం వార్డు బాట కార్యక్రమాన్ని చేపట్టారు. పలు వార్డుల్లో పర్యటిస్తూ నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించేందుకే వార్డు బాట కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, రాములు తిరుపతి, రాజ్‌కుమార్, రాజేశ్, కిషన్, బాల్‌రెడ్డి, అంజాగౌడ్, గోపాల్, వెంకటేశ్, జితేందర్, ఇలియాస్ బాబా, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, పోశయ్య, నవాబ్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ సందడి

రుద్రంగి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం సందడితో బుధవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని అరటి ఆకులతో, పూలతో అత్యంత సుందరంగా అలకరించారు. శ్రావణమాసంలో పౌర్ణమి తరువాత మొదటి బుధవారం కావడంతో భారీగా భక్తులు లక్ష్మీనరసింహస్వామిని ఉదయం నుంచి దర్శించుకొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోమిరె శంకర్, వైస్ చైర్మన్ దసారి గంగారాజం, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో ఇబ్బందులు కలగొద్దు..

వేములవాడ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా సహకార అధికారి రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని వట్టెంల, నూకలమర్రి గోదాంలను బుధవారం ఆయన పరిశీలించారు. గోదాంలలో ఉన్న యూరియా నిలువలను తనిఖీ చేసిన ఆయన సంఘం పరిధిలో ఎరువుల నిలువ, పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. సంఘం పరిధిలో యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వెంట ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారి వినీత తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వైద్య అధికారులు అన్నారు. వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో వైద్య అధికారులు పరిసరాల పరిశుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. ఇంటింటా తిరుగుతూ సర్వే నిర్వహించారు. వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. మందును పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ బాలకృష్ణ, సూపర్‌వైజర్ ఇందిరా, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఏఎన్‌ఎం కీర్తి, సుజాత, ఆశా కార్యకర్తలు సువర్ణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మునిగేల రాజు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ల భరత్ గౌడ్, కోల గంగారామ్, కునవేని వినోద్, గుగ్గిళ్ల అభిషేక్, సాయిరాం, మహేష్, సంజయ్ తదితరులు ఉన్నారు. అలాగే ఇందిరమ్మకాలనీలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధు అధ్వర్యంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కొపెల్లి శ్యాం, బల్ల లక్ష్మిపతి, బోగ రంగయ్య పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం..

ముస్తాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను, రేషన్ కార్డులను అందించారు. ఈకార్యక్రమంలో ఎఎంసీ ఛైర్మన్ తలారి రాణినర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, అనమేని రాజు, మామిండ్ల అంజనేయులు, ఉచ్చిడి బాల్‌రెడ్డి, అనిత, తోట ధర్మేందర్, ఈరవేని శ్రీనివాస్, కేసుగాని బాబు మెరుగు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ గ్రామంలో రాపిడ్ రెస్పాన్స్ టీం పర్యటించింది. ప్రతి ఇంటికి తిరుగుతూ జ్వరాలపై ఆరాతీసి రాపిడ్ టెస్టులు నిర్వహించారు. డ్రైడే నిర్వహించి మురికి కాలువల్లో ఏబీఈ మందు స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో రాపిడ్ టీం రాజు, రాజేందర్, తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రమీల, సతీష్, ఏఎన్‌ఎంలు జ్యోతి, పంచాయతీ కార్యదర్శి అనూష, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ముస్తాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జెండావిష్కరణ చేశారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, ఎందరో విద్యార్థుల విప్లవ కిశోరులను బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశంలోనే ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని పేర్కొన్నారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు ఆకారం రేవంత్, నాయకులు రాగూడ ప్రణయ్, రాకేశ్, అరవింద్, సాయి అర్జున్, వివేక్, సాత్విక్, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మహిళా సంఘాల ఏర్పాటుకు కృషి

ఇల్లంతకుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలో కొత్త మహిళా సంఘాల ఏర్పాటుకు కృషిచేయాలని ఏపీఎం లతామంగేశ్వరి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని కార్యాలయంలో బుధవారం శిక్షణాకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాశక్తి మిషన్ కార్యక్రమంలో భాగంగా 60సంవత్సరాలు పైబడిన వారితో, 18 సంవత్సరాల లోపు కిశోర బాలికల, సదరం సర్టిఫికెట్ ఉండి మహిళా సంఘాలలోని దివ్యాంగులతో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త సంఘాలు ఏర్పాటు చేసి ఈనెల 30 లోపు సమీప బ్యాంకులలో పొదుపు సంఘాల ఖాతాలు ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో సీసీలు రామచంద్రారెడ్డి, రాజేశ్వరి, రామచంద్రం, మండల సమాఖ్య కార్యదర్శి మమత, కోశాధికారి అంతగిరి సరస్వతిలతో పాటు గ్రామసంఘాల సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.

టై బెల్టుల ప్రదానం

గంభీరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల నాగంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 130 మంది విద్యార్థులకు బీజేపీ మండల ప్రదాన కార్యదర్శి విగ్నేష్ టై బెల్టులను ప్రదానం చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కానుకగా విద్యార్థులకు టై బెల్టులతో పాటు ఐడి కార్డులను విగ్నేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతుల పేరిట రాజకీయం చేయడం మానుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):రైతులపేరిట రాజకీయం చేయడం మానుకోవాలని మాజీ ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలో రైతులకు సరిపడా యూరియా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా కొంతమంది నాయకులు రైతులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. వర్షకాలంలో మండలానికి 3200మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 2000మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నిరంతరం పనిచేస్తున్నారని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈసారి యూరియా వాడకం పెరిగిందన్నారు. ప్రతిపక్షాలు చేసే కుట్రలను రైతులు గమనించాలని సూచించారు. రైతుల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు.

భారీవర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

ఇల్లంతకుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భారీవర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండలంలోని పలుగ్రామాలలో మంగళవారం అర్ధరాత్రి భారీవర్షం కురిసింది. మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే ప్రధానరోడ్డుపై భారీగా వర్షం నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఎంపీడీవో శశికళ, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంధ్యలు చేరుకొని నీటిని తొలగించే ఏర్పాట్లు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

తంగళ్లపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్లలో ఇందిరమ్మ ఇళ్ల భూమి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, నాయకులు లింగాల భూపతి, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, మునిగేల రాజు, గుగ్గిళ్ల భరత్, కోల శంకర్, ఆనందం, ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

జోగులాంబ అమ్మవారికి సిరిసిల్ల చీర..

సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ బుధవారం రాత్రి అలంపూర్ జోగులాంబ అమ్మవారికి చేనేత మగ్గంపై అగ్గిపెట్టెలో అమిరే విధంగా నేసిన బంగారు చీరను సమర్పించారు. హరిప్రసాద్ రెండు గ్రాముల బంగారం ఉపయోగించి జరీతో నేసిన అగ్గిపెట్టెలో అమిరే చీరను అమ్మవారి సన్నిధిలో అర్చకులకు అందజేశారు. చీరను అర్చకులు ఆవిష్కరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో చీరను సమర్పించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్థానిక రెడ్డి మిత్ర మండలి ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను బుధవారం అందజేశారు. పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని అక్షయకు రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థిని హిమబిందుకు రూ.2వేల నగదుతో పాటు తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. 6 నుంచి 10వ తరగతిలో మొదటి, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీ, స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, రెడ్డి మిత్ర మండలి సభ్యులు మోతె మల్లారెడ్డి, నిమ్మ మల్లారెడ్డి, దేవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలచందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న గ్రామస్థులు

కోనరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను టిప్పర్ ద్వారా తరలిస్తుండగా ధర్మారం గ్రామస్థులు పట్టుకున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ నిర్మాణానికి తరలించిన ఇసుకను టిప్పర్ ద్వారా అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్థులు పట్టుకుని తహసీల్దార్ వరలక్ష్మికి సమాచారం అందించారు. దీంతో టిప్పర్‌ను తహసీల్దాదర్ వరలక్ష్మి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు తోడ్పడాలి

చందుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని చందుర్తి ఎస్‌ఐ రమేష్ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులచే బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిద్దాం : ఎస్పీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ మహేష్ బీ గితే



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్

సిరిసిల్ల, క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావి తరాలకు మంచి భవిష్యత్తును అందిద్దామని ఎస్పీ మహేష్ బీ గితే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో ప్రతిఒక్కరు నడుం బిగించాలన్నారు. అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మ, సీఐలు నటేష్, రవి, ఆర్‌ఐలు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్ఐలు శ్రీకాంత్, ప్రేమానందం, జునైద్, శ్రవణ్, శ్రీనివాస్, రమేష్, పోలీస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఇందిరమ్మకాలనీ శివారులోని రవాణా శాఖ వాహనాల డ్రైవింగ్ టెస్ట్ గ్రౌండ్‌లో రవాణా శాఖ అధికారులు వాహనదారులతో డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి వంశీధర్, సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారి ప్రమీల, కానిస్టేబుల్ సౌమ్య, హోంగార్డ్ ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్ : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల (సెస్) జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగం - నష్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులతో సీఐ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల(సెస్) జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జీ వనజా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మడుపు నవీన్‌రెడ్డి, యాంటీ డ్రగ్స్ వారియర్ పోలీస్ కానిస్టేబుల్ వెంకటరమణ, కళాశాల అధ్యాపకులు మురళీ, సీతారాము, కే సునీత, శ్రీనివాస్, అఫ్రోజ్ సుల్తానా, ప్రవీన్‌కుమార్, గంగరాజు, కృష్ణవేణి, షాహీదా, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినీలు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపలి : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను నిర్వహించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● కోనరావుపేట : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మత్తు పదార్థాలపై కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : నూకలమర్రి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో రూరల్ ఎస్సై అంజయ్య విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాదకద్రవ్యాల కలిగే నష్టాలగూర్చి విద్యార్థులకు వివరించారు. మండల విద్యాధికారి కిషన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానందం, ఏఎస్సై రవీందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బాపురెడ్డి, కానిస్టేబుల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

జీవో 17 ను రద్దు చేయాలి..

- గురుకుల పాఠశాలల మధ్యాహ్న భోజనం కాంట్రాక్టర్ల నిరసన

తంగళ్లపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జీవో నంబరు 17ను రద్దు చేయాలని మండలంలోని గురుకుల పాఠశాలల మధ్యాహ్న భోజనం కాంట్రాకర్లు డిమాండ్ చేశారు. బుధవారం బద్దనపల్లి బాలికల గురుకుల పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవోను రద్దు చేసి తమకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు కంసాల మల్లేశం, భూక్య గజన్‌లాల్, బూర యాదగిరి, నాయిని శంకర్, ఎల్లయ్య, దేవయ్య, ఆనందం, శ్రీనివాస్, బాలరాజులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతపై ఆందోళన

గంభీరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని తల్లిదండ్రులు బుధవారం ఆందోళన చేపట్టారు. 5 తరగతుల్లో 94మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులే ఉన్నారని పిల్లల తల్లిదండ్రులు రాస్తారోకో చేపట్టారు. 6 నెలల కిందట ఉపాధ్యాయుడిని బదిలీ చేయగా, తాజాగా మరొకరిని డిప్యూటేషన్‌పై బదిలీ చేశారని, ఉపాధ్యాయులను నియమించాలంటూ సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని వారికి సర్దిచెప్పడంతో శాంతించారు.



లింగాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న తల్లిదండ్రులు